# ఉగాది

అచ్చాఫీసు ఆవరణదాటి తేలిగ్గా గాలిపీల్చి యింటి ముఖం పట్టాడు ఆలోచిస్తూ సత్యం.

సందులూ గొందులు, బాటలూ రోడ్లు వంకరటింకరగా, సన్నగా, ఇరుకుగా, నిటారుగా నుంచుని ఊరు చివరవరకూ లాక్కుపోయాయి. రెండు మైళ్ళ దూరం ఆలోచిస్తూనే నడిచాడు—మెల్లగా భారంగా నీరసంగా అడుగుల్లో అడుగులువేస్తూ.

అలవాటుపడ్డకాళ్ళు అరుగువరకూ వచ్చి ఆగిపోయాయి.

ఒకమారు తలఎత్తి యిల్లు చేరినట్టు గ్రహించి గబగబా మెట్లెక్కి లోపలికి వెళ్ళిపోయాడు.

బయట, ఇంటావిడ గుమ్మానికి చేరబడి అవతలికి తిరిగి బియ్యం ఏరుకుంటోంది, ఆమె సత్యం వచ్చినట్టుగా గుర్తించలేదు.

సత్యం ఆమెకు అలికిడి వినిపించనంత నెమ్మదిగా అరుగెక్కి తలుపు గొళ్ళెం తీస్తుండగా యింటావిడ వెనక్కి తిరిగిచూసింది.

సత్యం కూడా అదే సమయంలో ఆవిడని చూసి తప్పుచేసినవాడల్లే కుంచించుకుపోయి లోపలకువెళ్ళి తలుపులు దగ్గరకి వేసుకుని కుర్చీలో కూలబడ్డాడు. అయిదు నిమిషాలపాటు కళ్ళు మూసుకున్నాడు.

కళ్ళు తెరిస్తే గదంతా బోసిగా వెక్కిరిస్తోంది.

ఎదురుగా కుంపటీ, గిన్నెలూ ఖాళీగా పడున్నాయి. రెండు రోజులబట్టీ యిల్లు తుడవక ధూళి చెత్తా చేరి అసహ్యంగా కనిపిస్తోంది.

వెళ్ళి ఊడవాలనిపించలేదు. ఒంట్లో నీరసం....ఆయాసం. రెండు మైళ్ళు నడిచి నడిచి కాళ్ళు తిమ్మెర్లెక్కాయి. గది ఊడవడానికి కూడా ఓపిక లేదు. కుర్చీలో జారబడి చూస్తుండిపోయాడు.

నిన్న ఉదయం కాఫీ కాచి అలానే వుంచిన కుంపటిలోని బొగ్గుల బూడిద కిందకురాలి మీదకు ఎగిరివస్తోంది.

బూడిద మీదపడకుండా చేతిని అల్లల్లాడిస్తూ అలానే కూర్చుని కుర్చీ లోనే నిద్రపోయాడు.

అంత కలతనిద్రలోనూ ఒక కల!

అంతలోనే తెలివి.

మళ్ళీ అంతలోనే ఖాళీ గిన్నె! బోసి కుంపటి!

వళ్ళాల్నీ పొయ్యినూ చూస్తోంటే ఆకలి జ్ఞాపకానికొచ్చింది.

గట్టిగా నిట్టూర్చాడు సత్యం. భారంగా గోతిలోంచి, పాతాళంలోంచి బైట పడ్డట్టుగా ఊడిపడిందది.

అతనికి తెలుసు—తను చేయగలిగిందల్లా అంతకు తప్పించి మరేమీ లేదని.

ఏదో ఉద్ధరిద్దామని తల్లినీ తమ్ముడినీ ఊళ్ళోవదిలి పట్నం బయలుదేరి వచ్చాక యిటువంటి వాటికన్నిటికీ రోజూ అతను అలవాటు పడిపోయాడు.

ప్రయత్నించగా—కాళ్ళరిగిపోయినట్టు రోజల్లా తిరగ్గా తిరగ్గా—వచ్చిన నెల్లాళ్ళకు ఓ ప్రెస్‌లో ప్రూఫ్ రీడరుగా నెలకు నలభైరూపాయల జీతంమీద పని దొరికింది. చిన్నగది అద్దెకు తీసుకుని—అదీ వూరుచివర ఎవరూ వుండడానికి యిష్టపడనిచోట తనకు కావాలని ఒకరోజల్లా పట్టుపట్టి తక్కువ అద్దెకు బేరమాడి, యింట్లో స్వయంపాకంపెట్టి, ఒకరోజుతిని మరొకరోజు మాడి, మిగిలింది యింటికి పంపించేవాడు.

ఆనాటినుంచీ పస్తుండడం అంటే అట్టే కష్టమనిపించేదికాదు. మొదట్లో మోకాళ్ళలో తలదూర్చి భోరున ఏడ్చేవాడు. కాని అది పిరికితనం అనీ, అటువంటివి భవిష్యత్తులో రోజూ ఎదుర్కోవలసి వస్తుందని గుర్తించాక అలా

ఏడవడం కేవలం చేతగానితనమేగాక పిరికితనం అని అనిపించి నిట్టూర్పులోనే అంతటి బాధనూదాచి, మళ్ళీ ఆ విషయం ఆలోచించడం మానుకునేవాడు.

సత్యం కొంచెం సేపటివరకూ చలనంలేనివాడిలా కూర్చుని, దొడ్లో బావిదగ్గర మొఖం కాళ్ళూ చేతులూ కడుక్కొనివచ్చి, కుండలో ఉదయం పోసి వుంచిన చల్లనినీరు కడుపు పట్టినంతా గబగబా మూడు గ్లాసులుతాగి, మళ్ళీ వచ్చి కూర్చున్నాడు అలా శూన్యంలోకి చూస్తూ.

కిటికీలోనుండి నల్లపిల్లి గదిలోకొచ్చి కుంపటిమీది ఖాళీ గిన్నెను తడిమి నిరాశగా అతని ముందునుండి కిటికీ ఎక్కి వెళ్ళిపోయింది.

సత్యానికి అప్రయత్నంగా నవ్వువచ్చింది. ఆ తర్వాత దానిమీద జాలివేసింది.

చిల్లుకానీ చేతిలో లేనివాడు అనుగ్రహించినా ఫలితంలేదు. అందువల్లే సానుభూతిగా చూసి 'పాపం!' అనుకుని వూరుకున్నాడు.

'తనలాగే తనమీదా మరొకరు జాలిచూపిస్తారా?' అని ప్రశ్నించుకొన్నప్పుడు 'చూపించరని' జవాబు చెప్పుకోగలిగితే అనవసరంగా మరొకరిమీద సానుభూతి చూపించేవాడుకాదు.

క్రమక్రమంగా నల్లగా, దట్టంగా చీకటి వ్యాపించింది. భారంగా వేడిగా గట్టిగా విడిచిపెట్టిన గాలి అతనిచుట్టూ తిరుగుతోంది.

గదినిండా నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ గదిబయట ఎంగిలి మెతుకులకు కాసుక్కూచున్న ఊరకుక్క అరుపు, వీధిలో ఓ ఇంటిముందు అడుక్కొంటున్న ఒక ముష్టివాడి ఆలాపన, దీనంగా జాలిగా వాడిమాటలు, గొప్పగా దేవుడిలా ఎదుటివారిని పొగుడ్తోన్న పొగడ్తలు, అయినా ఆఖరున మిగిలిన నిరాశ! అరవగా అరవగా బొంగురుపోయిన కంఠం, వెనక్కు తిరిగిపోతూ గొణుక్కొంటున్నట్టు మెల్లగా తన దురదృష్టాన్ని తిట్టుకొంటోన్న మాటలు!

ప్రపంచంనిండా ఆకలి!

పనిచేస్తున్నా, రెక్కలుముక్కలు చేసుకుని ఆకారం వికారం అయ్యేవరకు—ఎముకల్లో మూలుగు రక్తం కరిగి చెమటై ఆవిరై అంతరించిపోయే

వరకు, చచ్చేవరకు పనిచేస్తున్నా తీరని ఆకలి! నలుగురూ తినిపారేసిన పులిస్తరాకుల్లో ఎంగిలి మెతుకులకోసం ఎగబడి నీచంగా కక్కుర్తిగా తింటోన్నా తరగని ఆకలి!

ఎలాపోతుందీ ఆకలి?

లక్షాధికారి యింట్లో పెంపుడు కుక్కగా, జంతు ప్రదర్శనశాలలో కోతిగా, పక్షితీర్థం—కొండమీద పక్షిగా, మినిష్టరుగారి పెళ్ళానికి అన్నగా, భోగంపిల్ల తమ్ముడిగా పుడితే ఆకలి తీరుతుందేమో!

విచిత్రమైన ఆలోచనలు అతన్ని చుట్టుముట్టేసినయ్. సీరియస్‌గా సమస్యను సాధించే మార్గాన్ని ఆలోచించి సారాంశం చెప్పాడు—ఫలానా రీతిగా పుడితే ఆకలి వుండదోయ్—అని. కాని అతనికి ఆ అదృష్టంలేదు. అతను కనిపెట్టినదానికి విరుద్ధంగా పుట్టాడు. అంతే! మళ్ళీ నిరాశ. ఆకలితీరని ఆలోచన. చేతగానితనాన్ని నిరూపిస్తోన్న అసహాయత.

ఇంటావిడ వచ్చింది. గదిలో దీపంలేదు. మనిషి లోపలవున్న అలకిడి లేదు. ఇంట్లోకొచ్చినవాడు ఏమయ్యాడు, ఎక్కడకు వెళ్ళాడు?

ఆమె పిలిచింది.

అదిరిపడి ఆలోచనలోంచి లేచి స్విచ్చి వేశాడు.

"ఏం చేస్తున్నావు బాబూ?" అంది ఆమె.

"ఏమీ చెయ్యడంలేదు, రండి. లైటుచుట్టూ రెక్కల పురుగులు చేరితే లైటార్పి యిలా కూర్చున్నాను" అన్నాడు.

ఆమె చాలా జాలిగా నవ్వింది. ఆ నవ్వు "అసలు సంగతి నాకు తెలుసులే నాయనా" అన్నట్టు వుంది.

ఆమె గుమ్మందగ్గరే నుంచుని "భోజనం అయిందా బాబూ" అంది.

"ఊఁ" అన్నాడు మెల్లగా. ఆ తర్వాత వెంటనే అందుకుని "ఉదయం ఆఫీసుకు వెళ్ళేముందే రెండు పూటలకు అన్నం, కూర వండుకున్నాను. మొన్న యింటి దగ్గరనుండి తెచ్చిన పచ్చడి వుండనేవుంది. రెండు పూటలూ వండుకు తినడం కష్టం అనిపిస్తుంటే మొన్నటినుండి ఒక్కసారే కలిపి వండు

కుంటున్నాను" అన్నాడు. అని, ఆమెకు కుంపటీ గిన్నెలూ కనబడకుండా అడ్డుగా వెళ్ళి నుంచున్నాడు.

"అయ్యో నాయనా! ఇంకా భోజనం కాలేదేమోనని ఆలస్యంగా కూర తెచ్చాను. తెలిస్తే ముందే తెచ్చేదాన్ని" అంటూ కూరగిన్నె టేబిలుమీద వుంచింది.

"ఎందుకూ భోజనం అయిపోయింది గదండీ" అంటూ గిన్నె పట్టుకెళ్ళి ఆమెకందించాడు.

ఆమె గదిచుట్టూ ఓమారు చూసి నవ్వింది. "పిచ్చినాయనా! నాదగ్గర మొగమాట పడొద్దన్నాను కదూ. వస్తానుండు" అంటూ వెళ్ళిపోయి మరో రెండు నిమిషాల్లో గిన్నెతో అన్నం పట్టుకొచ్చి టేబిలుమీద వుంచింది.

"అబ్బే తిన్నానని చెప్తున్నాను కదండీ" అన్నాడు సత్యం.

"చెప్పడానికేం, ఎన్నయినా చెప్పొచ్చు. ముందు కానియ్" అంది.

సత్యం ఎన్నో చెప్పి చూశాడు. లాభం లేకపోయింది. ఆమె మరీ బలవంతం చేస్తోంది. "నువ్వు మాత్రం మా పెద్దబ్బాయి లాంటివాడివికావా నాయనా" అంది, అతను కొంచెం మెత్తబడడంచూసి.

"పోనీ, యిప్పటికి కడుపు నిండుగావుంది. ఇక తినలేను, రేపిద్దురుగాని లెండి. ఇవ్వాల్టికి నన్ను క్షమించాలి" అన్నాడు ఎంతో ప్రయత్నంతో నిలబెట్టు కున్న అభిమానాన్ని పడదోసుకుంటూ.

"అయ్యో నాయనా, రేపు ఉగాది. కొత్తసంవత్సరంతోటి యిలాంటివి పుచ్చుకోకూడదు బాబూ. సంవత్సరం పొడుగునా అలానే వుంటారంటారు" అంటూ ఆమె బలవంతంగా అతని రెక్కపట్టుకుని గదిలో ఒకమూల పీటవేసి కూర్చోబెట్టి "ఊ....తిను నాయనా. నేను బయట వుంటాలే" అంది.

తప్పించుకునే మార్గంలేక తప్పనిసరిగా భోజనం ముందు కూర్చుని గబగబా అయిదు నిమిషాల్లో పూర్తిచేసి, గిన్నెల్ని తనే దొడ్లో బావిదగ్గర కడిగి ఆమె చేతికిచ్చాడు.

ఆమె అందుకుని నిండుగా చిరునవ్వు నవ్వి "నా నాయనే" అంది వెళ్ళిపోతూ.

వెళ్ళిపోతున్న ఆమెను ఆపి, కొంచెం పాదధూళి తీసుకోవాలనిపించింది. కాని యిది పురాణకాలం కాదు. అథవా కథల్లోనన్నా అలా చెయ్యడం తొలగించి వేశారు. తనిప్పుడు అలాచేస్తే పిచ్చివాడనే అంటారంతా. ఆమెకు మనసులోనే నమస్కారాలుచేసి, కాస్సేపు గదిలోనే అటూ యిటూ పచార్లుచేసి మంచం వాల్చుకుని పడుకున్నాడు. అంత వేగంగా నిద్రపోదామని కాకపోయినా ఏమీ తోచక, ఎక్కడకూ వెళ్ళాలనిపించక అక్కడే గదిలో మంచం వాల్చుకుని పడుకుని ఆమె అన్న మాటల్నే ఆలోచిస్తున్నాడు.

రేపు ఉగాది!

ఎదురుగా కేలండరు మీద నల్లక్షరాలమధ్య ఎర్రగా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది రేపటిరోజు.

ఈ సంవత్సరానికిది అంతిమం. రేపు మళ్ళీ కొత్త సంవత్సరానికి నూతన సృష్టికి నాంది. చెట్లు చేపలతోపాటు మానవ జీవితాలకు కొత్త పాత సంవత్సరాలమధ్య ఒక రోజును నిర్ణయించి, అటూ ఇటూ రెండు విభిన్నాల్ని కల్పించి అంత్య ఆరంభాల్ని సృష్టించారు—ఆనాడు ఏది చేస్తే అది ఆ సంవత్సరం పొడుగునా జరగవలసిందేనని! రాబోయే పన్నెండు నెలలకు ఆరోజు సూత్రప్రాయమని, ఆరోజు ఏడిస్తే పన్నెండు నెలలూ ఏడ్వేనని, నవ్వితే అంతకాలమూ నవ్వేనని, అదే ఆరోజు ప్రత్యేకత! కనుకనే ఆరోజు అంతా ఆనందంగా ఉంటారు. అథవా అలా ఉండాలని ప్రయత్నిస్తారు. చక్కగా, నచ్చిన బట్టల్ని తొడుక్కుంటారు. అగాధాల జీవితాలవాళ్ళు, ఆనందాల్లో మునిగి తేలేవాళ్ళు, కూటికిలేక పస్తులుండేవాళ్ళు, కాటికి కాలుచాచినవాళ్ళు, ముసలి వాళ్ళు, పిల్లలు, పెద్దలు అంతా ఆనందంగా వుండడానికై ప్రయత్నిస్తుంటారు.

సత్యం చటుక్కున లేచి కూర్చున్నాడు.

"వీల్లేదు. ఏమయినా రేపు పస్తు వుండకూడదు. రేపు ఉగాది! కొత్త సంవత్సరం ప్రారంభంతోనే పస్తుల్తో, యీ చినిగిన బట్టల్తో ఎక్కడకూ వెళ్ళకుండా యింట్లోనే కూర్చుంటే యీ రాబోయే సంవత్సరమంతా అలానే గడపాల్సివస్తుంది. రేపొక్కరోజయినా ఆనందంగా, నిండుగా నవ్వుతూవుండి సంవత్సరమంతా సుఖమయం చేసుకోవాలి. గతించినదానిలా యీ ఏడాది

కాకూడదు. లోగడవన్నీ కలల్లా చెరిపేస్తే చెరిగిపోవాలి. అందుకని ఈరోజే రేపటివన్నీ తయారుగా వుంచుకోవాలి. రేపు ఎవరినీ అప్పు అడగగూడదు, వస్తు వుండగూడదు."

సత్యం తలుపుతీసి అరుగుమీదకు వచ్చాడు. ఇంటావిడ మనుమరాల్ని ఆడిస్తూ వీధి అరుగుమీద కూర్చునివుంది.

సత్యానికి ఆమెను చూడగానే మనసులో ఆశ చిగురించింది.

"ఒకసారి యిలా వస్తారా" అన్నాడు.

ఆడిస్తున్న మనవరాల్ని చంకన వేసుకొనివచ్చి "ఏంబాబూ ?" అంది ప్రశ్నార్థకంగా సత్యం ముఖంలోకిచూస్తూ.

"ఏంలేదు....అదే....అదే" నసిగాడు సత్యం.

"ఫరవాలేదు చెప్పు" అందామె ఆప్యాయంగా.

"ఏంలేదు, ఒక్క అయిదు రూపాయలు వుంటే అప్పిస్తారేమోనని. మీకు మళ్ళీ వారం రోజుల్లో జీతం రాగానే యిచ్చేస్తాను."

ఆమె చాలా బాధపడింది. అయ్యోనాయనా ! నువ్వు అడిగినప్పుడే నాదగ్గర లేకుండాపోయాయి. పొద్దున్న పదిరూపాయలనోటు—అలా అదొక్కటీ అడుగున పెట్టెలో వుంటే తీసి, రేపటి సామానులకని ఖర్చుచేస్తే ఒక్క కానీ మిగలలేదు ! పాపం ఎప్పుడూ నోరువిడిచి అడగనివాడివి, అడక్క అడక్క అడిగినందుకు, చూడు—సమయానికి నాదగ్గర లేకుండా పోయాయి. ఉదయం అడిగినా బావుండును—ఏదో సగం యిచ్చి సగం ఖర్చుచేసేదాన్ని. ఏమనుకుంటావో ఏమో" అంది చాలా బాధపడుతూ.

'పాపం ! వుంటే యిచ్చేదే. అది నాదురదృష్టంలే' అనుకుంటూ వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. కాస్సేపు కూర్చుని ఆలోచిస్తూ ఆలోచిస్తూ చటుక్కున లేచి తలుపు గొళ్ళెంపెట్టి వీధిలోకి బయలుదేరాడు.

అప్పటికే జనసంచారం పల్చబడి వీధులు నిర్మానుష్యంగా వున్నాయి. అక్కడక్కడ ఒక్కొక్కకొట్టూ కాపలా కాస్తోన్న పోలీసు జవానుల్లా రహదారి పొడుగునా నిల్చున్నాయి. కొట్లలో నిద్రమత్తుకు ఆగలేక కునుకుతున్నాయి

హరికెనుదీపాలు. వీధుల్లో మునిసిపాలిటీ దీపాలు విధిలేక వెలుగుతున్నట్టు ఉన్నాయి.

అలానే ఒక్కడూ ఊరిమధ్య యిల్లు తెలియని మిత్రుడ్ని కలుసుకునేందుకని బయలుదేరాడు.

అతికష్టంమీద యిల్లు కనుక్కొని అక్కడకు వెళ్ళేసరికి హాయిగా నిద్రపోతున్నాడతను. అతన్ని లేపి, వచ్చిన కారణం చెప్పాడు "ఒక్క ఐదు రూపాయలు—చివరకు మూడన్నా సరే వుంటే చేబదులిద్దూ" అన్నాడు.

"అయ్యోపాపం! నువ్వు అడిగినందుకన్నా యివ్వాలే. ఏదో కొద్దిగా వుంటే సాయంకాలమే రడీమేడ్ షాపులో బట్టలు తీసుకున్నాను. ప్రమాణంచేసి చెప్తున్నా అమాత్రం సాయం చెయ్యలేనూ" అన్నాడు ఆ మిత్రుడు.

అభిమానం దెబ్బతింది. ఎందుకడిగానా అనుకున్నాడు. చూపుల్లో, ముఖంలో, మాటల్లో నటన అంతా అర్థమవుతూనేవుంది. 'వెధవ అయిదు రూపాయల గురించి స్నేహాన్నికూడా పాడుచేసుకున్నాడు.'

అక్కడకు దగ్గర్లోనే మరొక స్నేహితుడి యిల్లు వుంది. కాళ్ళీడ్చుకుంటూ అక్కడకు వెళ్ళాడు. అప్పుడే ఆ స్నేహితుడు సినిమా ఫస్టుషో నుంచి వచ్చి భోజనంచేసి ఏదో పత్రిక తిరగేస్తూ కూర్చున్నాడు.

సత్యాన్నిచూసి ''రావోయ్" అని ఆహ్వానించి "ఏం, యిలా యింత రాత్రప్పుడు వచ్చావ్?" అన్నాడు.

సత్యం కారణం చెప్పాక, అంతకు పదింతలు దుఃఖిస్తున్నవాడిలా కిందకు దిగజారిపోయి, తను అసహాయుడయినందుకు సానుభూతి చూపించి అరుగువరకూ వచ్చి సాగనంపాడు.

తననుతాను తిట్టుకుంటూ, నోట్లో గొణుక్కుంటూ వచ్చినదారి వెంబడే వెనక్కు మళ్ళాడు సత్యం.

సినిమాహాలు సందుమలుపు తిరుగుతుండగా హాలుదగ్గర శర్మ కనిపించాడు. సినిమాకు వెళ్దామని గాబోలు భార్యతో కలిసివచ్చాడు. సత్యాన్ని చూసి పలకరించి "ఏమిటీ ఎక్కడనుండి వస్తున్నావ్?" అన్నాడు.

సత్యానికి నిజం చెప్పాలనిపించలేదు. అప్పటికే అభిమానం చంపుకొని ముగ్గుర్ని అడిగి లేదనిపించుకున్నాడు. శర్మనుకూడా అడిగి లేదనిపించు కోవడం యిష్టంలేదు. కాని శర్మను ఎరుగున్నంతమట్టుకు అతను అలాటివాడు కాడని అతనికి తెలుసు. లోగడ సత్యం అడగ్గానే చేతిలో పెట్టాడు. ఉంటే తప్పకుండా యిచ్చేమనిషి. 'పోనీ అంతమందిని అడగ్గాలేనిది యీయన ఒక్కడ్నీ అడిగితే ఏంపోతుందిలే' అనుకుని పక్కకు పిలిచి చెప్పాడు.

"అర్జంటుగా అయిదు రూపాయలు కావలసివుండి తెలిసిన యిద్దరు ముగ్గుర్ని అడిగి లేదంటే వచ్చేస్తున్నాను. నీదగ్గర ఏమన్నా వుంటే కాస్త సర్దవోయ్. జీతాలు రాగానే ఇచ్చేస్తా. నాకు అంత యిబ్బందిగా వుండకపోను. ఈ నెలలో యింటిపన్ను, తమ్ముడి జీతం కట్టాలంటే వచ్చిన జీతం అంతా యింటికే పంపించేశాను."

"సమయానికి నాదగ్గరాలేవు సత్యం. ఎంత అవసరంవుండి అడుగు తున్నావో పాపం! నెలాఖరిరోజులు కదూ, అందులోనూ కొత్త సంసారం. కానీ మిగలడంలేదు. ఈ నెలలో అప్పుడే యిరవై రూపాయలు అప్పుచేశాను. ఇదిగో....ఎప్పటినుండో సినిమాకు వెళ్దాం అని అనుకొంటుంటే యివ్వాల్టికికాని కాలేదు. అవీ, ఈ సాయంకాలం మన గుమాస్తాగార్నడిగి అయిదు రూపాయలు పుచ్చుకొన్నాను తర్వాత యిచ్చేస్తానని. పోనీ అంతగా అవసరమయితే యీ అయిదూ తీసుకెళ్ళు, మేం తర్వాత సినిమాకు వెళ్తాంలే. ఇంకా నెలరోజులన్నా ఆడుతుందికదా" అంటూ అయిదు రూపాయలనోటు తీసి యివ్వబోయాడు. "అబ్బే అట్టే అవసరం లేదులే" అంటూ అతను బలవంతంచేస్తున్నా వినిపించు కోకుండా తప్పించుకుని వెళ్ళిపోయాడు. చుట్టూ చీకట్లలోని నిరాశన తోలు కుంటూ వచ్చిన దారివెంటే వెళ్ళి యిల్లు చేరుకున్నాడు.

ఆరాత్రి సరిగా అతనికి నిద్రపట్టలేదు. కళ్ళు చెమ్మగిల్లాయి. రాత్రి చాలా సేపటివరకూ జీవితాన్ని నెమరువేసుకున్నాడు. తెల్లవారుతుండగా ఎప్పుడో అతనికి తెలీకుండానే నిద్రపట్టింది.

ఉదయం లేచేసరికి బారెడు పొద్దెక్కింది. ఇంటావిడ పూజచేస్తూ వాయి స్తోన్న గంట గణగణ మోగుతోంది. కిటికీలోంచి గదిలో సగంవరకు సూర్య కిరణాలు వాలుతున్నాయి.

బద్ధకంగా ఆవులించి వళ్ళువిరుచుకుని లేచి కాలకృత్యాలు ముగించుకుని బావిదగ్గర మొఖం కడిగి స్నానం చేసివచ్చాడు. రాత్రి విప్పిన బట్టల్నే తొడుక్కొని, కిటికీముందుకు కుర్చీలాక్కుని కూచుని బయటికు చూస్తున్నాడు.

వీధిలో నాలుగిళ్ళావల ఒక వేపచెట్టు తెల్లగా పూలను తలలో తురుముకుని నుంచుంది. కుర్రాళ్ళు కొత్త బట్టల్లో వీధిలో పరుగెడుతున్నారు ఎదురింటి వాళ్ళమ్మాయి ముస్తాబయి వేపపచ్చడి పంచేందుకు వీధిలోకి బయలుదేరింది.

బయలుదేరేముందు గుమ్మం అరుగుమీద కాలువుంచి సత్యం కిటికీలోకి చూసింది. అలా చూసినకళ్ళు నవ్వలేదు. ముడుచుకుపోయాయి. అసహ్యించుకున్నట్టుగా గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది.

సత్యం నవ్వుకొన్నాడు లోలోపల్నే.

ఇంటావిడ వేపపూపచ్చడి తెచ్చి యిచ్చింది.

తీసుకొని తిన్నాడు. మళ్ళీ మధ్యాహ్నం వరకూ కదల్లేదు

మనస్సు బావుండక ఆలోచిస్తూ అలానే కూర్చుండిపోయాడు

ఎప్పుడో పన్నెండు గంటలవేళ కొంచెం ఆకలనిపిస్తే వెళ్ళి మంచినీళ్ళు తాగివచ్చి మంచంవాల్చి పడుకున్నాడు. రాత్రి సరిగా నిద్రలేక చూస్తుండగానే కళ్ళు మూతలుపడి నిద్రపోయాడు.

నిద్రలో ఓ చక్కటి కల!

ఆ కలలో సత్యం ఓ పెద్ద ప్రెస్ ప్రొప్రయిటరు.

ఆ ఎదురింటి పిల్ల అతన్ని ప్రేమించింది. ఆనాడు ఉగాది. అతను లేవగానే స్నానంచేసి సరికొత్త ఉలెన్‌సూటు తొడుక్కుని వీధిలో నుంచున్నాడు.

ఆ పిల్ల వేపపూవచ్చడి తెచ్చి ఇచ్చింది. వాలుగా చూస్తూ చిరునవ్వుతో అందించింది. అందంగా ముస్తాబయి కారులో అతనితోపాటు ఊరల్లా తిరిగింది. ఆ సాయంకాలం యిద్దరూ సముద్రంవద్దకు షికారుకు బయలుదేరారు. ఇసుక తిన్నెలమీద చెట్టపట్టాలు పట్టుకుని నడిచిపోయారు. ఏకాంతమయినచోట యిద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

సాయంకాలపు వెలుతురు చారలు నల్లబడిపోయాయి. సముద్ర కెరటాలు ఎగిరిపడుతూ నీటి తుంపర్లుగాలిలో ఎగిరొస్తున్నాయి. చంద్రుడూ, నక్షత్రాలూ మబ్బుల్ని దాటుకుంటూపోయి తెల్లగా నవ్వుతున్నాయి.

ఆ యిద్దరూ అక్కడ కూచుని రహస్యాలు మాట్లాడుకున్నారు.

ఆ ఎదురింటి అమ్మాయి కిలకిలా పక్షిలా మాటలుచెప్తూ నవ్వుతూ ఎన్నో కబుర్లు చెప్పింది. ఏమయినా మనం పెళ్ళి చేసుకుతీరాలంది. ఈ ఉగాది మన ప్రేమకు చిహ్నంగా వుండాలంది. ఇంకా కళ్ళ సంజ్ఞలతో నోటితో చాలా చాలా చెప్పింది.

అతను ఆ సాయంకాలం ఆమెకు ఓ హోటల్లో పెద్ద విందు చేశాడు. సినిమాలోలా కలిసి డేన్సు చేశాడు.

కల కరిగిపోయింది.

ఎవరో వచ్చి అతన్ని నిద్ర లేపుతున్నారు.

కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగుండా కుర్చీలో కూచుని శర్మ నిద్ర లేపుతున్నాడు.

కళ్ళు నులుముకుంటూ అంతసేపూ తను చూసింది, అనుభవించింది కలతప్ప వాస్తవం కాదని అర్థమై దీర్ఘంగా నిట్టూర్చి లేచి కూర్చున్నాడు సత్యం. లేచిన కొన్ని సెకన్లవరకు ఏమీ మాట్లాడలేదు. కరిగిపోయిన కలను మళ్ళీ గుర్తు చేసుకుంటూ వుండిపోయాడు.

ఆ తర్వాత తేరుకుని "ఏం, పనిమీద వచ్చావా?" అన్నాడు శర్మను ఉద్దేశించి.

"ఉన్నపనంతా నీతోనేగాని ఏమిటలా నిద్రలోనే నవ్వేస్తూ చేతులు తిప్పుతూ ఒక్కొక్కప్పుడు ఏదో అస్పష్టంగా మాట్లాడేసుకుంటున్నావ్! కలేమైనా వచ్చిందా?" అడిగాడు శర్మ.

"ఊఁ. కలే వచ్చింది. చక్కటి కల! ఆ కలలో నేను ఉగాది చేసుకున్నాను! ఎదురింటి అమ్మాయితో ఊరల్లా కారుమీద షికారు తిరిగాను.

అందులో నేను లక్షాధికార్ని. ఆ అమ్మాయి నన్నూ, నేను ఆ అమ్మాయినీ ప్రేమించుకున్నాం. ఆమెతో కలిసి విందారగించాను. డేన్సు చేశాను. ఉగాది శోభంతా మామధ్యే వుంది. బంగారంలా జిగేల్‌మన్న భవంతిలో డేన్సు చేస్తోంటే నువ్వొచ్చి లేపావ్. కల చెదిరిపోయింది..."

"నావల్ల నీ ఉగాది కార్యక్రమం పాడయిందనుకుంటాను. ఏమంటావ్?" నవ్వాడు శర్మ. తర్వాత జేబులో నుండి అయిదు రూపాయలనోటు తీసి "ఇదిగో, పాపం నిన్న అడిగావ్. సమయానికి లేకపోయింది. డబ్బు విషయం మా ఆవిడ అడిగితే చెప్పాను. ఆమె పెట్లో దాచుకున్నవి అయిదు రూపాయ లుంటే తీసిచ్చింది. పొద్దున్నే రాలేకపోయాను, ఇంద" అంటూ ఇవ్వబోయాడు శర్మ.

సత్యం మందహాసం చేశాడు.

"అక్కర్లేదు, వుండనియ్యి. పెద్దగా అవసరం వుండి అడగలేదు ఎందుకడిగానో ఆ అవసరం తీరిపోయింది. ఈ రోజు ఉగాదని, రోజులా కాకుండా కాస్త సర్దాగా వుందామని అడిగాను. కాని ఎందుకులే. ఉగాదంతా యిప్పుడే కలలో చేసుకున్నాగా! ఇంతకు పదింతలు సంతోషంగా చేసుకున్నాను. మళ్ళీ ఉగాది చేసుకోడమేమిటి....ఇంక వద్దులే" అన్నాడు సత్యం.

శర్మ ఆశ్చర్యంగా మిత్రుడ్నే చూస్తూ వుండిపోయాడు.

(1959)

★